తామర పురుగు తినేస్తుంది!

- మిర్చిలో వేగంగా విస్తరిస్తున్న తామర పురుగు
- రోజుల వ్యవధిలోనే వాడిపోతున్న మొక్కలు
- ఆందోళన చెందుతున్న రైతులు


మిర్చి పంటలో క్రిమిసంహార మందులు పిచికారీ చేస్తున్న రైతు


మిర్చి పూతలో తామర పురుగులు

గడివేముల: ఈయేడు ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులు సమస్యలతో సతమవుతూనే ఉన్నారు. వర్షాభావ పరిస్థితులు వెంటాడుతూనే ఉన్నాయి. దీంతో ఖరీఫ్ సాగు ఏ మాత్రం కలిసిరాలేదు. మిర్చిపైరు బాగుందనుకుంటున్న సంతోషం రోజులు కూడా నిలువలేదు. మిర్చిపై తామర పురుగు దాడికి దిగింది. రైతులకు ఆందోళన తప్పడం లేదు. మిర్చి ఏపుగా పెరగడంతో దిగుబడి అధికంగా వస్తుందనున్న సమయంలో తామర పురుగు అతలాకుతలం చేస్తోంది. మిర్చి పంటపై ఇటీవల బొబ్బర తెగులు ప్రభావం చూపించగా, తాజాగా పూతలో తామర పురుగులు కనిపించడం తోపాటు వేరు కుళ్లు పురుగులు చుట్టుమిట్టాయి. కంటికి రెప్పలా పెంచుకున్న పంట కళ్లెదుటే వాడిపోతుంటే దిక్కుతోచని స్థితిలో ఉన్నారు రైతులు. గడివేముల మండలంలో దాదాపు వెయ్యి ఎకరాలు, పాణ్యం మండలంలో 2500 ఎకరాల్లో మిర్చి పంటను సాగుచేసినట్లు ఉద్యానవనశాఖ అధికారుల చెబుతున్నారు. గడివేముల, కొర్రపోలూరు, మంచాలకట్ట, గని, బూజునూరు, బిలకలగూడూరు గ్రామాల్లో రైతులు మిర్చిని అధికంగా సాగుచేశారు.

రోజుల వ్యవధిలోనే పంట నాశనం

తామర పురుగు గుర్తించిన వారం రోజుల వ్యవధిలోనే పంటనాశనం అవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తామర గుడ్డు నుంచి పురుగుగా మారేందుకు 10–15 రోజులు పడుతుంది. ఇది తల్లి దశలో ఉన్న సమయంలో పూతలో పెరిగి పూత నుంచి కాయ రానివ్వకుండా రైతుకు నష్టం కలిగిస్తుంది. అయితే పలురకాల మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. కొత్త తరహా తామర పురుగు ఏ మందులకు పోవడం లేదని రైతులు వాపోతున్నారు. వర్షాలు అధికంగా పడటంతో పాటు మిరప పంటలో నీటి నిల్వ మూలంగా వేరుకుళ్లు తెగులు విజృంభించిందని రైతులు అంటున్నారు. పంట చేతికి రాదని భావించిన కొందరు రైతులు తొలగిస్తున్నారు.

వేపనూనెతో దూరం

తామర పురుగులను వేప నూనెతో హరించవచ్చు. నూనెలోని చేదుకు పురుగులు పూతను తినలేక క్రమంగా చనిపోతాయి. దీంతో పాటు 10 గ్రాముల కుంకుడు రసంలో 250 గ్రాములు ఇంగువ రసం కలిపి సరిపడా నీటితో ఎకరా పైరుపై పిచికారీ చేయాలి. లేదా ప్రిప్రానిల్ 2 గ్రాములు, వేపనూనె 2 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి మార్చిమార్చి పిచికారీ చేయాలి.

ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదు



నాకు మూడెకరాల పొలంతో పాటు రెండు ఎకరాలు కౌలు తీసుకుని మిర్చి పంటను సాగు చేశా. గత ఆరేళ్లుగా మిర్చినే సాగు చేస్తున్నా. మొన్నటి వరకు మిర్చి బాగానే ఉంది. ఉన్నట్లుండి మిర్చి పూతపై తామర పురుగు కనిపించింది. దీంతో పూత ఎదగడం లేదు. ఎన్నో రకాల పురుగు మందులు వాడినా ఫలితం లేకుండా పోయింది. అయోమయంగా ఉంది.

– చాకలి వెంకటరమణ, మిర్చి రైతు, గడివేముల

ఆరెకరాల పంటను దున్నేశా...



ఏడేళ్లుగా మిరప పంటను సాగు చేస్తున్నా. ఈ సీజన్‌లో పన్నెండు ఎకరాలలో మిరప పంటను సాగు చేశా. వేరు కుళ్ల తెగులు, తామర పురుగు అధికం కావడంతో ఆరు ఎకరాలను దున్నివేశా. ఎకరాకు ఇప్పటి వరకు రూ.60 వేలు వరకు పెట్టుబడి పెట్టా. పంట బాగా ఉంది అనుకున్న సమయంలో తామర పురుగు దాడితో పూత, లేత ఆకులు రాలి పోతున్నాయి. ఎన్నోరకాల మందులు పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోయింది.

–బాలచెన్ని,మిర్చి రైతు,గడివేముల

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



మిర్చి పంటను ఈ ఏడాది కొత్తగా తామర పురుగులు ఆశించాయి. ఎన్నడూ లేని విధంగా తామర పురుగుతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పంటపోలాల్లో నీలిరంగు, పసుపురంగు అట్టలను ఉంచుకోవడం ద్వారా తల్లిపురుగులను నివారించుకునే అవకాశం ఉంటుంది. అలాగే శాస్త్రవేత్తలు సూచించిన క్రిమిసంహారక మందులు వాడాలి.

– తేజశ్వని, ఉద్యానశాఖ అధికారి, పాణ్యం నియోజకవర్గం

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అశ్వర్థ నారాయణ స్వామి కల్యాణోత్సవం


స్వామివారిని దర్శించుకుంటున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కల్లూరు అర్బన్ 33వ వార్డులోని శ్రీఅశ్వర్థనారాయణ స్వామి కల్యాణోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కళ్యాణోత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన


కోడుమూరు కొండపై స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సందీప్‌కుమార్

కోడుమూరు రూరల్ : కోడుమూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ గురువారం స్థలాన్ని పరిశీలించారు. కోడుమూరు సమీపాన కొండపై ఉన్న స్థలాన్ని తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌తో కలిసి ఆర్డీఓ పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. ఆర్డీఓ వెంట మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


క్రీడాకారులతో ఉపాధ్యాయులు

గడివేముల: స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి అండర్–14 త్రోబాల్ పోటీలకు మండలంలోని కరిమద్దెల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ క్రీడాకారులు ఈనెల 29, 30 తేదీల్లో చిత్తూరు జిల్లా పుటాలపాడులో జరిగే త్రోబాల్ పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం ప్రతాప్ తెలిపారు. విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు బాలవెంటేశ్వర్లును హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు ఆనంద్‌బాబు, మల్లారెడ్డి, నాగయ్య, వీరయ్య, సుందర్ అభినందించారు.

సస్యరక్షణతో మంచి దిగుబడులు


కంది పంటలలో పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు

గడివేముల: సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చని ఏఓ హేమ సుందర్ రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని వైకే తాండ గ్రామంలో ఏఓ 13 మంది రైతులతో కూడిన 43 ఎకరాలకు సంబంధించి కంది పంటపై ఇండ్ గ్యాప్ పొలంబడి నిర్వహించారు. రైతులకు కంది పంట పైన సస్యరక్షణ చర్యలను తెలియజేస్తూ మరుక మచ్చల పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఓ వివరించారు.

హౌస్ హోల్డ్ మ్యాపింగ్ పరిశీలన


బి.తాండ్రపాడులో జరుగుతున్న మ్యాపింగ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాథ్

కర్నూలు (రూరల్) : మండల పరిధిలోని బి.తాండ్రపాడు, పసుపల, గార్గేయపురం గ్రామాల్లో గురువారం ఎంపీడీఓ రఘునాథ్ పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌ను ఆయన పరిశీలించారు. మ్యాపింగ్‌లో వెనుకంజలో ఉన్నామని, వేగవంతం చేయాలని ఉద్యోగులకు ఎంపీడీఓ సూచించారు.

3న పారా మెడికల్ సీట్లకు కౌన్సెలింగ్

కర్నూలు (హాస్పిటల్): పారా మెడికల్ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి డిసెంబర్ 3న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, రోస్టర్‌ను అనుసరించి సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఈసీజీ టెక్నీషియన్ 2 సీట్లు (ఎస్సీ–1, ఎస్టీ–1), డార్క్ రూమ్ అసిస్టెంట్– 1 (బీసీ–ఏ), అనస్థీషియా టెక్నీషియన్– 2 సీట్లు (బీసీ–బీ, బీసీ–సీ), డీఎంఐటీ – 1 (ఎస్టీ), క్యాథలాబ్ టెక్నీషియన్ – 1 (ఓసీ ఈడబ్ల్యూఎస్) ఉన్నట్లు తెలిపారు.

పెద్దాసుపత్రిలో పోస్టులను భర్తీ చేయాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కనీసం 350 ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓ, స్ట్రక్చర్ బేరర్స్ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. వారు గురువారం అమరావతిలో మంత్రిని కలిసిన అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో 1,590 పడకలు ఉన్నాయని, ఈ సంఖ్యను బట్టి నర్సింగ్ స్టాఫ్ 650 మంది, శానిటేషన్ వర్కర్స్ 350, సెక్యూరిటీ గార్డులు 250 ఉండాలన్నారు. అయితే ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలు, స్ట్రక్చర్ బేరర్స్ కనీసం వంద మంది కూడా లేరని వివరించారు. ఈ కారణంగా వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఓపీలలో ఒక్కొక్కరు మూడు, నాలుగు వార్డుల్లో ఒత్తిడితో పనిచేయాల్సి వస్తోందన్నారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.బాలస్వామి నాయక్, ట్రెజరర్ సురేష్ తదితరులు ఉన్నారు.

1న షుగర్ వ్యాధిపై అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1వ తేదిన షుగర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ జి.భవానీప్రసాద్ షుగర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

వైభవంగా శ్రీరామదాసు స్వామి రథోత్సవం


అశేష జనవాహిని మధ్య సాగుతున్న రామదాసు స్వామి రథోత్సవం

కోడుమూరు రూరల్ : కోడుమూరు మండలంలోని లద్దగిరి గ్రామంలో వెలసిన శ్రీరామదాసు తాత తిరునాల ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. కోట్ల కుటుంబ సభ్యులు కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోట్ల హరిచక్రపాణిరెడ్డి, కోట్ల రాఘవేంద్రరెడ్డి, కోట్ల హరితరుణ్‌రెడ్డి, కోట్ల కౌసిక్‌రెడ్డి తదితరులు పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. స్వామివారి రథోత్సవాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచేగాకా ఇతర జిల్లాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ప్రజలు పెద్ద ఎత్తున గోవింద నామస్మరణ చేస్తూ రథంపై పూలవర్షం కురిపించారు.

జ్యోతిరావుపూలేకు ఘన నివాళి


పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే 143వ వర్ధంతిని ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. పాణ్యం ప్రభుత్వ డిగ్రీశాలలో పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. సమసమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడు పూలే అని ప్రజా సంఘాల నాయకులు గుర్తు చేశారు. స్త్రీ హక్కులు, బాలికల విద్య కోసం, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ నంద్యాల ప్రధాన కార్యదర్శి ప్రతాప్, సమాజ్‌వాదీ పార్టీ నంద్యాల అధ్యక్షుడు పెరుగు శివకృష్ణ, సీపీఎం న్యూడెమోక్రసీ అరుణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సి.బెళగల్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాల మైదానంలో గురువారం మహాత్మా జ్యోతిరావ్‌పూలే 134 వర్ధంతిని నిర్వహించారు. జ్యోతిరావ్ పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పూలే త్యాగాలను ఈ సందర్భంగా సర్పంచ్ పాండురంగన్న గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శులు బాయికటి మద్దిలేటి, ముందరింటి వెంకటేష్, ఉప సర్పంచ్ ఎస్ఎం ఇబ్రహీం, కో ఆప్షన్ సభ్యుడు ముల్ల హారున్ రషీద్, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు సీబీ గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఈ.తాండ్రపాడు జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో గురువారం జ్యోతిరావుపూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పూలే సమాజానికి చేసిన సేవలను సర్పంచ్ బాలపీరా గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, సూరి, రంగా తదితరులు పాల్గొన్నారు.


జ్యోతిరావ్ పూలేకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పూలే చిత్ర పటానికి పూలమాల వేస్తున్న సర్పంచ్, ఎస్ఎఫ్ఐ నాయకులు

పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలి


వినతిపత్రమిస్తున్న సీపీఐ నాయకులు

కల్లూరు: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కల్లూరు అర్బన్ ప్రాంతాల్లో వీకర్‌సెక్షన్ కాలనీ, ముజఫర్‌నగర్‌లతో పాటు పలు సచివాలయాల్లో ఉద్యోగులకు వినతి పత్రమిచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయాలు మంజూరు చేయాలన్నారు. అర్బన్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్, రామాంజనేయులు, మల్లికార్జున, రేణుక, జానకి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు వర్చువల్ బోధన

కర్నూలు కల్చరల్: రాష్ట్రంలోనే ప్రథమంగా పదో తరగతి విద్యార్థులకు వర్చువల్ క్లాస్ రూం బోధనను కర్నూలు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం పాఠశాల, ఇందిరాగాంధీ మెమోరియల్ పాఠశాల విద్యార్థులతో కలెక్టర్ సంభాషించారు. ఆయన మాట్లాడుతూ.. వర్చువల్ విద్యాబోధనకు అధునాతన సాంకేతిక పరికరాలతో డీఈఓ కార్యాలయంలో స్టూడియోను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని 352 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బోధన అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 119 పాఠశాలలకు బోధన అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. 42 మంది అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు వర్చువల్ విధానంలో బోధన అందించేందుకు ముందుకొచ్చారని చెప్పారు. డిసెంబర్ 7వ తేదీన జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్‌ను పండుగలా జరపాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.శామ్యూల్‌పాల్ పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్‌లో సత్తా

కర్నూలు (టౌన్): బాపట్ల జిల్లాలోని సూర్యలంక బీచ్‌లో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీల్లో రెండవ స్థానంలో నిలిచిన జిల్లా జట్టు క్రీడాకారులు కప్పు, మెడల్స్ అందుకున్నారు. అండర్–14, అండర్–17 విభాగంలో ప్రతిభ చాటిన క్రీడాకారులను గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, నాగశేఖర్ అభినందించారు. వారు మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

చీడపీడల నివారణకు యాప్

కర్నూలు(అగ్రికల్చర్): వివిధ పంటలకు సోకే చీడపీడల నివారణకు జాతీయ స్థాయిలో ప్రత్యేక యాప్ తీసుకొచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. ఆండ్రాయిడ్ లేదా ఐఫోన్ ద్వారా పంటలకు వ్యాపించిన చీడపీడల ఫొటోలు తీసి ఎన్‌పీఎస్ఎస్ అప్‌లోడ్ చేసిన వెంటనే వాటిని గుర్తించడమే కాకుండా సమగ్ర సస్యరక్షణ చర్యలను కూడా సూచిస్తుందని తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో రైతులు, ఎంపిక చేసిన వ్యవసాయ అధికారులు (స్కాట్స్), జిల్లా వనరుల కేంద్రం అధికారులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. విజయవాడలోని సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ (సీఐపీఎంసీ) చీడపీడల నియంత్రణ అధికారులు వీరయ్య చౌదరి, సురేష్ కాంట్లీ ముఖ్య అతిథులుగా హాజరై చీడపీడల నియంత్రణకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి మాట్లాడుతూ.. చీడపీడల నియంత్రణకు కేంద్రం తీసుకొచ్చిన మొబైల్ యాప్‌పై రైతులు, వ్యవసాయ అధికారులు, జిల్లా వనరుల కేంద్రం అధికారులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. పంటల్లో చీడపీడల కారణంగా రైతులు 30 నుంచి 40 శాతం వరకు నష్టపోతున్నారని, దీన్ని సకాలంలో గుర్తించి నివారించుకుంటే రైతుల ఆదా యం పెరుగుతుందన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అన్నపూర్ణ, సాంకేతిక ఏఓ అల్లీపీర తదితరులు పాల్గొన్నారు.

రేపు టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలోని టేబుల్ టెన్నిస్ హాల్‌లో ఈనెల 30వ తేదీన జిల్లాస్థాయి జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–15, అండర్–17, అండర్–19 విభాగాల్లో ఆసక్తి కలిగిన క్రీడాకారులు, అలాగే సీనియర్ విభాగంలో పురుషులు, మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వయస్సు ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని సూచించారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌కు కళ్లెం

- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ పరీక్షలు
- ఇంటింటి సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది


దుర్వేశిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గడివేముల : క్యాన్సర్ మహమ్మారి ప్రస్తుతం చాప కింద నీరులా విస్తరిస్తోంది. జాతీయ కుటుంబ ఆరోగ్యశాఖ సర్వే ప్రకారం క్యాన్సర్‌ను ఆలస్యంగా గుర్తించడం మూలంగా అధిక మరణాలు సంభవిస్తున్నాయి. ఈ మహమ్మారిని ఎదుర్కోవాలంటే ముందస్తుగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయిస్తే ప్రాథమిక దశలోనే లక్షణాలు గుర్తించడం ద్వారా మరణాల సంఖ్యను తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. మహిళల్లో పలు రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని వారికి అవగాహన కల్పించి పరీక్షలు నిర్వహించాలని వైద్యులు చెబుతున్నారు. ఈ మహమ్మారిని అరికట్టేందుకు ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. సమాచారాన్ని నిక్షిప్తం చేయడానికి వైద్యారోగ్యశాఖ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తున్న సర్వేను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి 18 ఏళ్లు నిండిన వారికి పలురకాల ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు ఆరోగ్య సిబ్బంది. స్కూళ్లలోనూ విద్యార్థులకు పరీక్షలు చేస్తున్నారు.

స్క్రీనింగ్‌తో కనుగొనే ప్రయత్నం...

ఒక వ్యక్తిలో క్యాన్సర్ కణాల కోసం శోధించడాన్నే స్క్రీనింగ్ అని పిలుస్తారు. ఆ వ్యక్తిలో క్యాన్సర్ ప్రభావిత లక్షణాలు ఉన్నాయా లేదా అనే విషయాలపై ఆరోగ్యశాఖ సిబ్బంది పరిశీలించి క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారు. ముందస్తు రోగ నిర్ధారణకు ఈ పరీక్షలు దోహదం చేస్తాయి. ప్రస్తుతం గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్ సమగ్ర ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యక్తి గత వివరాలతో పాటు దీర్ఘకాలిక ఇతర వ్యాధులపై వైద్య సిబ్బంది ఆరా తీస్తారు. గతంలో సంక్రమించిన వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. చెడు అలవాట్లపై ఆరా తీస్తారు. మహిళల్లో సంక్రమించే గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ లక్షణాలను సైతం గుర్తిస్తారు. ఆరోగ్యశాఖ సిబ్బంది 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని యాప్ ద్వారా వివరాలు అప్‌లోడ్ చేస్తారు. దంత సమస్యలు నమోదు చేయడంతో క్యాన్సర్ దశను ప్రాథమిక అంచనా వేస్తారు. ప్రజలకు కేన్సర్ స్క్రీనింగ్‌పై ముందుగా అవగాహన కల్పిస్తారు.

సర్వేకి సహకరించాలి....



క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలపై ఎలాంటి అపోహలు వద్దు. స్క్రీనింగ్‌తో ముందస్తుగా క్యాన్సర్ లక్షణాలను గుర్తించవచ్చు. ఎక్కువగా మహిళలు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్లతో బాధపడుతున్నారు. ఈ పరీక్షలతో సత్ఫలితాలు పొందవచ్చు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సిబ్బంది సర్వేకు సహకరించి పరీక్షలు చేయించుకోవాలి.

–డాక్టర్ కిరణ్, మెడికల్ ఆఫీసర్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, గడివేముల.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు అశోక్ నగర్ (పాలకొట్టాల)లో నివాసముంటున్న రేవూరి అనీల్‌బాబు (31) కేసీ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కాలనీలోని సత్యనారాయణ, సుజాత దంపతులకు కుమారుడు, కూతురు సంతానం. తండ్రి సత్యనారాయణ వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. కుమారుడు అనిల్‌బాబు కడప రవి సినిమా థియేటర్‌లో పాప్‌కార్న్ అమ్ముకుంటూ జీవనం సాగించేవాడు. 15 రోజుల క్రితం అనారోగ్యంతో కర్నూలుకు వచ్చాడు. గురువారం ఉదయం తల్లి సుజాతతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లి కేసీ కెనాల్‌లో దూకాడు. దేవనగర్ సమీపంలో నీటిలో మృతదేహం కొట్టుకుపోతుండగా స్థానికులు గుర్తించి మూడో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.